క్లుప్తంగా

మురుగుతో నానా అవస్థలు



అయిజ: మూడు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మున్సిపాలిటీలోని దుర్గానగర్ కాలనీ శుక్రవారం నీట మునిగింది. మురుగు నిలిచి ఉండడంతో దోమల ఉధృతి చెంది ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు.

శ్రమదానం చేసిన పోలీసులు



అయిజ: మండలంలోని మేడికొండ రోడ్డుపై నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పక్కన ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడి అధ్వానంగా మారింది. శుక్రవారం ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా పోలీసులకు ప్రయాణికులు అభినందనలు తెలియజేశారు.

రక్తదాన శిబిరం



అయిజ: మండల కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంతో మొత్తం 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



ధరూరు: మండల పరిధిలోని ర్యాలంపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు కృష్ణ, శాంతన్న సొంత ఖర్చులతో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, మాజీ సర్పంచ్ తిమ్మప్ప, చిట్టెం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గద్వాల: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో పట్టణానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జంబురామన్‌గౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కనువిందు చేసిన ఇంద్రధనస్సు



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో శుక్రవారం సూర్యాస్త సమయంలో ఏర్పడిన ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఈ చిత్రాన్ని సాక్షి తన కెమెరాలో బంధించింది.

ఆర్థిక ఇబ్బందులతో నేత కార్మికుడి ఆత్మహత్య

గద్వాల క్రైం: ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా.. గద్వాల పట్టణానికి చెందిన నీలి నాగరాజు(48) చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తుండేవాడు. కొన్ని రోజుల నుంచి తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిటన్లు ధ్రువీకరించారు. మృతుని భార్య నీలి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



గట్టులో హైస్కూల్ విద్యార్థుల కవాతు, జాతీయ నేతల వేషధారణలో విద్యార్థులు



మల్దకల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న ఝాన్సీరాణి



ఉండవెల్లిలో కృష్ణవేణి పాఠశాలలో చిన్నారుల నృత్య ప్రదర్శన



అయిజ తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ధరణీషా



శాంతినగర్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఏఈఈ సుబ్బరాయుడు, సిబ్బంది

సుజలం.. సుఫలం.. వందేమాతరం

సాక్షి నెట్‌వర్క్: స్వాతంత్య్ర దిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి ప్రసంగాలు చేశారు. జిల్లా కేంద్రంలో విద్యార్థులు ప్రభాత్ భేరీ నిర్వహించారు. పలు విద్యా సంస్థల విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో వినూత్న ప్రదర్శనలు చేశారు. ప్రధాన చౌరస్తాల్లో జాతీయ గీతాలు ఆలపిస్తూ కోలాటం, పిరమిడ్‌లు వేశారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే విజయుడు, ఆర్డీఓ అలివేలమ్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేశారు.

☆ వడ్డేపల్లి మున్సిపల్ కమిషనర్ రాజయ్య జెండా ఎగురవేసి సిబ్బందికి యూనిఫాంలు, అవసరమైన కిట్‌లు అందజేశారు.

☆ అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో స్వాతంత్య్ర దిన వేడుకలు కనుల పండవగా జరిగాయి. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి మిథున్ తేజ, కమిషనర్ శ్రీరాములు, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ పద్మావతి జాతీయ జెండా ఎగురవేశారు.

☆ కేటీదొడ్డి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగువేశారు. తహసీల్దార్ హరికృష్ణ, ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ రమాణరావు, ఎస్ఐ శ్రీనివాసులు వేడుకల్లో పాల్గొన్నారు.

☆ అయిజలో చైతన్య హైస్కూల్ విద్యార్థులు ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ప్రదర్శన కనువిందు చేసింది.

☆ అలంపూర్ మండల పరిధిలోని క్యాతూర్, భీమవరం చెక్‌డ్యాంల వద్ద 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అధికారులు ఎంపీడీఓ పద్మావతి, వ్యవసాయధికారి నాగార్జునరెడ్డి మువ్వెనెల జెండా ఎగురవేశారు.

☆ మానవపాడు మండల కేంద్రంలో ఎస్ఐ చంద్రకాంత్, తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌వర్మ, పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, సీడీపీఓ సుజాత, ఎంఈఓ శివప్రసాద్ జాతీయ జెండాకు వందనం చేశారు.

☆ ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శేఖర్, ఎంపీడీఓ తిరుపతన్న, తహసీల్దార్ ప్రభాకర్, హైస్కూల్‌లో హెచ్‌ఎం హేమలత, ఏఓ అనిత స్వాతంత్య్ర దిన వేడుకల్లో పాల్గొన్నారు.

☆ మల్దకల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఝాన్సీరాణి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎస్ఐ నందికర్, సింగిల్ విండో కార్యాలయం వద్ద తిమ్మారెడ్డి, డాక్టర్ స్వరూపరాణి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నర్సింహులు జాతీయ జెండా ఎగురవేశారు.

☆ ధరూరులో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీఓ మంజూల, పీహెచ్‌సీ వద్ద డాక్టర్ ఆయేషా బేగం, కాంగ్రెస్ నాయకులు డీఆర్ శ్రీధర్, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, రవీంద్రబాబు, వార్డెన్‌లు నర్సింహులు, సుధీర్‌గౌడ్, ఎస్ఐ శ్రీహరి, ఎస్ఓ గోమతి జాతీయ జెండా ఎగురవేశారు.

☆ గట్టులో ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ చెన్నయ్య, ఎస్ఐ మల్లేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, స్పెషల్ ఆఫీసర్ నదీమ్, ఏఓ హనుమంతురెడ్డి, ఏఈఈ చెన్నయ్య, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజు స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్నారు.

☆ ఇటిక్యాల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వీరభద్రప్ప, ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, ఏఓ రవికుమార్, ఎస్ఐ రవినాయక్, వైద్యాధికారి రాధిక, ఎంఈఓ వెంకటేశ్వర్లు స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్నారు.



అలంపూర్ మున్సిపల్ కార్యాలయంలో వందనం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు



జిల్లా కేంద్రంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి



క్యాతూరులో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ప్రత్యేక అధికారులు



అలంపూర్‌లో విద్యార్థుల ర్యాలీ



జిల్లా కేంద్రంలో స్వాతంత్య్ర వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు సరిత, తదితరులు



ఇటిక్యాలలో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ వీరభద్రప్ప, అధికారులు



కేటీదొడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎంపీడీఓ రమణారావు



అలంపూర్‌లో మాంటిస్సోరిలో గ్రామీణుల వేషధారణలో విద్యార్థుల ప్రదర్శన



ధరూరులో కేరళ బృందంచే ప్రభాత భేరి

మెరుగైన విద్యే ప్రభుత్వ లక్ష్యం


గద్వాలటౌన్: మెరుగైన విద్యే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ సంతోష్ అన్నారు. శుక్రవారం శుక్రవారం పిల్లిగుండ్ల కాలనీలో కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ సంతోష్ మాట్లాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నూతన పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలలకు దూరంగా ఉన్నట్లు గుర్తించామని, వారి సౌకర్యార్థం నూతన పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం అద్దె భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నామని, త్వరలోనే శాశ్వత భవనం చేపడుతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన సాగేతుందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హనుమంతు, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ హంపయ్య, రేఖ, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

బురుజుపై ముళ్ల పొదలు తొలగించండి

మల్దకల్: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో ఉన్న రాతి బురుజుపై ముళ్ల పొదలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గాలులు వీచిన సమయంలో బురుజు నుంచి రాళ్లు కిందకు పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి బురుజుపై ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.



నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



గట్టులో క్షీరాభిషేకం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్, పాలక వర్గం సభ్యులు



అయిజలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గట్టు: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలక వర్గం పదవీ కాలం పొడిగించిన నేపథ్యంలో గురువారం పాలక వర్గ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, వైస్ చైర్మన్ మహదేవప్ప, డైరెక్టర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి..

అయిజ: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట మధుసూదన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఇటిక్యాల: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు సురేష్ శుక్రవారం తెలిపారు. తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగిన 2025- 26 జాతీయ యోగా పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు కార్తీక్ మొదటి, రాజశేఖర్ ఆరవ స్థానం విజయం సాధించినట్లు తెలిపారు. అదే విధంగా రాజస్తాన్‌లోని జైపూర్‌లో జరిగిన 8వ జూనియర్ నేషనల్ దూ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థులు రంజిత్‌కుమార్, భాస్కర్ ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు రవిప్రకాష్, సుజాతను అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమత, నాగరాజ్, కృష్ణ, వెంకట్రాములు, దేవన్న, బాబు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

అలంపూర్ రూరల్/కేటీదొడ్డి/మల్దకల్: అలంపూర్ మండల పరిధిలోని క్యాతూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ మెరిట్ విద్యార్థులకు క్యాతూర్ కెనెరా బ్యాంక్ అధికారులు ప్రోత్సాహక బహుమతులు శుక్రవారం అందజేశారు. 5, 6, 7 తరగతుల్లో మెరిట్ సాధించిన విద్యార్థులకు రూ.3 వేలు, 8, 9, 10 తరగతుల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.5 వేలు అందజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు వసంతకుమార్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థులకు రూ.5వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాదవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

✶ పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి కావేరికి దాత మాజీ ఎంపీటీసీ కృష్ణ రూ.3,016, స్కూల్ టాపర్ శైలజకు రూ. 2016, మూడో బహుమతి, స్కూల్ తరపున ఆరుగురు విద్యార్థులకు హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

✶ మల్దకల్ మండలంలోని పాల్వాయి, మద్దెలబండ, మల్దకల్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నగదు పారితోషికాలను అందజేశారు. మద్దెలబండకు చెందిన అఖిల మండల టాపర్‌గా నిలవగా గ్రామ పెద్దలు మేకల సాయిబాబా రూ.10 వేలు, మాజీ సర్పంచ్ కొత్తింటి జయమ్మ నారాయణ రూ.10వేలు అందజేశారు. పాల్వాయి హైస్కూల్‌లో ప్రతిభ కనబరచిన పావని, మన్సూరా, శిరీషలకు దాతలు నాయికి నాగేశ్వర్‌రావు రూ.10వేలు, మునిస్వామి, చంద్రాములు, నవీన్ ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింహస్వామి, రేణుక, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మద్దెలబండలో విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న దాతలు

అద్దె భవనాల్లో అవస్థలు

- ఇరుకు గదుల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- ఏళ్ల తరబడి వేధిస్తున్న సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు

కేటీదొడ్డి: నూతన మండలాన్ని ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషించారు. కానీ గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. మండలంలో అభివృద్ధి కానరావడం లేదని వాపోతున్నారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలు మాత్రం తీరడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు తీరలే..

పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పునర్విభజన నేపథ్యంలో గట్టు, ధరూరులోని కొన్ని గ్రామాలను కలిపి కేటీదొడ్డి మండలాన్ని ఏర్పాటు చేసింది. మొత్తం 23 పంచాయతీలు ఉన్నాయి. మండలంగా ఏర్పడి 9 ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయలేదు. దీంతో అధికారులు, సిబ్బంది నానా అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకొని నూతన భవనాలు మంజూరు చేయాలని త్వరగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అద్దె భవనాలు, ఇరుకు గదులు

ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో అదీ ఇరుకుగదుల్లో నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయం, మహిళ సమాఖ్య భవనం, పోలీస్ స్టేషన్ కార్యాలయాలు ఇరుకు భవనాల్లో కొనసాతున్నాయి. కనీసం ఐదు కుర్చీలు పెట్టే పరిస్థితి లేదని అధికారులు వాపోతున్నారు. పోలీస్ స్టేషన్ అద్దె భవనంలోనే కొనసాగుతుంది. సిబ్బందికి గృహాలు కూడా లేవు. ఎంపీడీఓ కార్యాలయానికి సొంత భవనం లేదు. మండల వనరుల కార్యాలయం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం లేకపోవడంతో వారు అందులోనే రెవెన్యూ పనులు కొనసాగిస్తున్నారు. సమావేశాలు, సభలు నిర్వహించాలన్నా చెట్ల కిందనో లేక ప్రైవేటు ఫంక్షన్ హాల్లోనే నిర్వహించాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు.



కేటీదొడ్డిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం



మండల వనరుల కార్యాలయంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

ఆరుబయటే సమావేశాలు



మండలంలో ఎలాంటి నూతన కార్యాలయాల నిర్మాణం ఇప్పటి వరకు జరుగలేదు. అద్దె భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగుతున్నాయి, సమావేశాలు నిర్వహించాలంటే అధికారులు ఆరుబయటే నిర్వహిస్తున్నారు.

– రంగప్ప, కేటీదొడ్డి

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



నూతన భవనాలతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ దృష్టి తీసుకెళ్తాం. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటాం. మండలాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తాం.

– ఉరుకుందు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, కేటీదొడ్డి